క్లుప్తంగా

అనారోగ్యంతో అర్చకుడి మృతి

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీచెన్నకేశవ స్వామి, శ్రీరాఘవేంద్రస్వామి దేవాలయాల అర్చకుడు, దూప దీప నైవేద్య అర్చక సంఘం (డీడీఎన్ఎస్) జిల్లా కమిటీ సలహాదారులు అక్కి శ్రీనివాసమూర్తి బుధవారం మధ్యాహ్నం అనారోగ్య కారణాలతో స్వర్గస్తులయ్యారని కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు కొడంగల్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, కుమార్తెల వివాహం జరిగిందని, కుమారుడు బీటెక్ చేస్తున్నారని డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అర్చకుడిగా పనిచేస్తున్న ఆయన మృతి చెందడం తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు

మండల విద్యాధికారి గోపాల్



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి గోపాల్

పరిగి: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారి గోపాల్ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని ఓ బెకరీ, బుక్‌స్టాల్‌లో పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అక్కడ తనిఖీలు నిర్వహించారు. మొత్తం పాఠ్య పుస్తకాలను పరిశీలించి వాటిని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల పేరిట విద్యార్థుల నుంచి దోపిడీ చేస్తే సహించమన్నారు. ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం



దుద్యాల్: అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

దుద్యాల్: మండల కేంద్రంలోని మొదటి, రెండోవ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం టీచర్లు రేహానా సుల్తానా, వెంకటమ్మ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీకి వచ్చిన పిల్లలకు అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమానికి చిన్నారులు, వారి తల్లులు హాజరయ్యారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: వడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఉదయం అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను హెచ్‌ఎం నరేందర్‌గౌడ్ పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం పలకలు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు రవి, విద్యావతి, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ రమాకాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, వెంకటమ్మ, బుక్‌కీపర్ నర్సింహారెడ్డి, ఏపీసీ చైర్మన్ సువర్ణ, భీంరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



బూట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సునితా సంపత్

తాండూరు రూరల్: కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తాండూరు పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ సునితా సంపత్ అన్నారు. బుధవారం పెద్దేముల్ మండలంలోని గిరిజన విద్యార్థులకు బీవీజీ ఫౌండేషన్ ఉచితంగా బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునితా సంపత్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా తాండూరు ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రియాజ్, మాజీ సర్పంచు శివరాం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంశెట్టి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారయ్యేనా?

- దుద్యాల్‌లో వాడివేడిగా స్థానిక ఎన్నికల కోలాహలం
- నోటిఫికేషన్‌కు తప్పని ఎదురు చూపులు
- గ్రామాల్లో ఆశావహుల అంతర్గత ప్రచారాలు
- టికెట్ రేసులో పాత, కొత్త నాయకులు



దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్: గ్రామ పంచాయతీ ఎన్నికలు గతేడాది నుంచి ఇదిగోవచ్చే...అదిగో..అంటూ నోటిఫికేషన్ ఆలస్యమైంది. ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. దసరా తర్వాత అని కొందరు, సంక్రాంతిలోపే పూర్తవుతాయని మరికొందరు చెప్పుకోవడమే తప్ప కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ముహూర్తం ఖరారవుతుందో లేదోనని ఆశావహుల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. ఐనప్పటికి వారు గ్రామాల్లో అంతర్గత ప్రచారాల్లో బిజీగా మారారు. టికెట్ రేసులో పాత, కొత్త నాయకుల సందడి మొదలైంది. వారం, పది రోజుల నుంచి స్థానిక పోరు వార్త మరింత ఊపందుకుంది. ఈ నెల చివరి వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి చేసుకుని, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ప్రకటనలు చేస్తుండడంతో గ్రామాల్లో మళ్లీ ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది. దుద్యాల మండల కేంద్రంతో పాటు హస్నాబాద్, హకీంపేట్, కుదురుమల్ల, హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, ఈర్లపల్లి, చిలుముల మైల్వార్, హంసంపల్లి, చెట్టుపల్లి తండా, గౌరారం వంటి పెద్ద గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు రెండు నుంచి మూడు గ్రూపులుగా విడిపోయి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్లు ఆశిస్తూ బడా నాయకుల వద్ద లాబింగ్‌లు మొదలుపెట్టారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీలోనే ఉండి నడిపించిన నాయకులు ఒక వర్గంగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ పెద్దల హామీలతో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు ఒక వర్గంగా ఏర్పడి, ఎంపీ ఎన్నికల ముందు ఇతర పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు ఒక వర్గంగా ఏర్పడి టికెట్ల కోసం పార్టీ పెద్దల దగ్గర ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు.

మనకే టికెట్టు..

మండలంలోని అన్ని గ్రామాల్లో పలు పార్టీల నాయకులు, ఆశావహులు నిత్యం ఏదో ఒక కాలనీలో అంతర్గతంగా కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మన వర్గానికే టికెట్ కేటాయిస్తున్నారని గొప్పలు చెప్పుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. మనకే టికెట్టు పక్కా అని ఎవరికి వారే చెప్పుకుంటూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు.

చిన్నా, పెద్ద తేడా లేకుండా..

ప్రస్తుతం సర్పంచ్‌గా పోటీ చేసేందుకు చిన్నా, పెద్ద తేడా లేకుండా అర్హులు సై అంటే సై అంటున్నారు. పాలనపై అవగాహన లేని వారు కూడా పార్టీ పెద్దల మద్దతుతో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. రాజకీయంగా అవగాహన లేకున్నా, ప్రజల్లో పలుకుబడి లేకున్నా పోటీ చేయాలని ఎంతో మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సారి యువకులు మాత్రం అధికంగా పోటీ చేసే అవకాశం ఉందని కొందరు జోస్యం చెబుతున్నారు. అధికార పార్టీ అండ ఉంటుందనే నమ్మకంతో గ్రామాల్లో పోటీకి ఆసక్తి చూపుతున్నారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు కలవు. ఇక్కడ అధికంగా గిరిజన తండాలే ఉన్నాయి. కొన్ని తండాల్లో మాత్రం రెండు వర్గాల పోటీ ఉండగా, మరి కొన్ని చోట్ల వర్గ పోరు లేకుండా పోటీకి దిగేందుకు సిద్ధపడుతున్నారు.

సీఎం నియోజకవర్గం కావడంతో..

దుద్యాల మండలం సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోని మండలం కావడం, అభివృద్ధి పనులు కూడా జోరుగా సాగుతుండడంతో పక్కగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తారని ఆశావహులకు నమ్మకం ఏర్పడింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది అభ్యర్థులు తయారవుతున్నారు. గ్రామ అధ్యక్షుడి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి స్థాయి నాయకుడి వరకు పోటీలో దిగే అవకాశం ఉందని చెబుతున్నారు. నిత్యం గ్రామాల నుంచి గ్రూపులుగా వెళ్లి తమకే టికెట్ ఇవ్వాలని పార్టీ పెద్దల వద్ద క్యూ కడుతున్నారు. అంతటితో ఆగకుండా తెలిసిన ఇతర పెద్ద నాయకుల ద్వారా లాబియింగ్‌లు మొదలు పెట్టారు. ప్రతి గ్రామం నుంచి రెండు నుంచి మూడు వర్గాలు పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడంతో ఎవరికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

లగచర్ల ఘటన..

ఇటివలే పారిశ్రామిక వాడకు భూములు తీసుకునే విషయంలో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. లగచర్ల ఘటనతో మండలంలో కాంగ్రెస్ పార్టీకి కొంత నష్టం కల్గించే అవకాశం ఉందని ప్రజలు బహిరంగగానే మాట్లాడుకుంటున్నారు. అభివృద్ధి పేరుతో పేదల భూములు తీసుకోవడంతో ప్రభుత్వం కొంత అతి ఉత్సాహం చూపించిందని వాదన. భూములు ఇవ్వని రైతులు బలమైన వాదన వినిపించడంతో అధికారులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా తీసుకుని రైతులపై లాఠీ ఛార్జి చేశారు. అప్పట్లో దేశ వ్యాప్తంగా వార్తలు వచ్చాయి. ఇదే ఘటన స్థానిక ఎన్నికలపై ప్రభావం చూపుతుందా? లేదా? అనేది ఎన్నికల తర్వాత తేలనుంది. ఏది ఏమైనా పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు ఉన్నారనేది తెలుస్తోంది.

అభివృద్ధికి కృషి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు.



మాట్లాడుతున్న ప్రహ్లాదరావు

కుల్కచర్ల: భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ముందుకుసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు, కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘనపురం వెంకటయ్యలు పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రపంచంలో ఆర్థికంగా పటిష్టస్థితిలో ఉన్న దేశాల్లో భారత్ ఒకటన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్రం వాటా ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు మైపాల్, బందయ్య, జిల్లా కన్వీనర్ కేశవులు, చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో సమన్యాయం

పూడూరు: బీజేపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని మండల అధ్యక్షుడు రాఘవేందర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్నేగూడలో 11 సంవత్సరాల మోదీ సుపరిపాలన వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా నాయకులు వెంకటయ్య, అనీల్, రాజు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

తుల్జాభవానీ ఫర్టిలైజర్ షాప్ యజమానిపై కేసు

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: తనిఖీలతో సరి అనే శీర్షికన బుధవారం సాక్షిలో వచ్చిన కథనానికి వికారాబాద్ ఏడీఏ శంకర్‌రాథోడ్ స్పందించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల ప్రకారం తుల్జాభవానీ ఫర్టిలైజర్ షాప్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశామని ఏడీఏ తెలిపారు. దీంతో పాటు 6ఎ కింద కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 13న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గంగాప్రసాద్‌లు తుల్జాభవానీ ఫర్టిలైజర్ విత్తన, ఎరువుల విక్రయ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారని ఆయన గుర్తు చేశారు. అక్కడ ఎరువుల అమ్మకాల్లో నిల్వ, అమ్మకాల వివరాలు సక్రమంగా లేవని, అనుమతులు లేని క్రిమి సంహారక మందులు, 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలను గుర్తించారని ఆయన పేర్కొన్నారు. ఈ దుకాణ యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని అదేరోజు ధారూరు వ్యవసాయ అధికారికి వారు నివేదిక అందజేసి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా యజమానిపై వివరాణ కోరుతూ ఏడీఏ కార్యాలయం నుంచి షోకాజ్ పంపించారు. అనంతరం 6ఎ కింద బుధవారం కేసు నమోదు చేశారు.

యోగా చేయండి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి రోజు యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్ అన్నారు. బుధవారం యోగా డేను పురస్కరించుకొని పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యోగాపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ఈ ర్యాలీ పట్టణ ముఖ్య కూడలి నుంచి పలు కాలనీల్లో కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి యోగా సాధన ఎంతో అవసరమన్నారు. కుమారస్వామి, లింగమయ్య, రామయ్య, రాంచంద్రయ్య, గవయ్య, విజయ్‌కుమార్, వెంకటయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మంజూరు చేస్తాం



దౌల్తాబాద్: పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు



కుల్కచర్ల: పనులను ప్రారంభిస్తున్న నాయకులు

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

దౌల్తాబాద్: మండల కేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను బుధవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. రానున్న మూడున్నరేళ్లలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లను ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తప్ప, భీములు, మల్కప్ప, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పేదల కలలు నెరవేరుతున్నాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్చాటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. చౌడాపూర్, మందిపల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నో ఏళ్లుగా ఇళ్ల కోసం ఎదురుచూసిన పేదల కలలు నెరవేరనుందన్నారు. వెంకటయ్య గౌడ్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- చిలుకవాగు ప్రక్షాళన పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- మున్సిపల్ అధికారులను ఆదేశించిన మున్సిపల్ శాఖ ఎస్ఈఈ చెన్నారావు



చిలుకవాగు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ శాఖ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ చెన్నారావు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్ఈ చెన్నారావు, ఈఈ ప్రభాకర్‌రెడ్డి చిలుకవాగు ప్రక్షాళన, ఆదర్శనగర్ ప్రాంతంలో చేపడుతున్న కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో రూ.16 కోట్లతో నిర్వహిస్తున్న చిలుకవాగు నాళా నిర్మాణ పనులు, రూ.2 కోట్లతో ఆదర్శనగర్‌లో పాత కుంటలో మురుగు కాల్వ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పనులు ఎంత వరకు పూర్తి చేశారని కమిషనర్ విక్రంసింహారెడ్డి, డీఈ మణిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. చిలుక వాగు నిర్మాణంలో నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని ఆదేశించారు. పాత కుంట వద్ద నిర్మిస్తున్న మురుగు కాల్వ నిర్మాణపనులను పరిశీలించేందుకు వెళ్లిన అధికారులతో సింధు డిగ్రీ కళాశాల యజమాని రంగారావు నాళా నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకు చెందిన స్థలంలో నిర్మిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి చొరవతో గొడవ సద్దుమణిగింది.

ఫీజులను నియంత్రించాలి

ఎంఈఓకు వినతి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని బీసీ జేఏసీ నాయకులు బుధవారం మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక ఫీజు వసూళ్లకు పాల్పడుతున్నాయన్నారు. సాధారణంగా ట్యూషన్ ఫీజు మాత్రమే తీసుకోవాల్సిన యాజమాన్యాలు, అడ్మిషన్ ఫీజు పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నాయన్నారు. అలాగే ఐఐటీ, ఒలంపియాడ్ కోర్సుల పేరుతో తల్లిదండ్రుల వద్ద అధిక మొత్తం లాగుతున్నారన్నారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి ఆయా పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు భానుప్రసాద్, సాయి కుమార్, మహేశ్, మనోహర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వండి

- లాగిన్ ఐడీ లేదంటున్న తహసీల్దార్ కిషన్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్‌కార్డు లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రేషన్ కార్డుదారులు

దుద్యాల్: రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే మండల వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం రేషన్ కార్డు సవరణ సర్వీసులు అందుబాటులో ఉంచినా దుద్యాల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అందుకు సంబంధించిన సర్వీసులు కరువయ్యాయి. నిత్యం వందల మంది రేషన్ కార్డు సవరణ కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దుద్యాల్ మండలానికి సంబంధించిన అప్లికేషన్లను అధికారులు పాత మండలానికి పంపిస్తున్నారు. దీంతో ఆయా మండలాలకు చెందిన దరఖాస్తు దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చినా ఇక్కడ మాత్రం సర్వీసులు అందుబాటులో లేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా రేషన్ కార్డులకు సంబంధించిన లాగిన్ ఐడీ దుద్యాల్ మండలానికి ఇంకా రాలేదని, అధికారులకు ఇదే విషయమై విన్నవించామన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి



బంట్వారం: కొత్తగా చేరిన విద్యార్థులతో ఎంఈఓ చంద్రప్ప



పరిగి: తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు ఎండీ ఇలియాస్

ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారన్నారు. అనంతరం కొత్తపల్లి యూపీఎస్ విద్యార్థులను కోట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అడ్మిషన్లు ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య..

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత బోధన చేపడుతున్నారని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తన పిల్లలను సర్కారు బడిలో చేర్పించారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఎండీ ఇలియాస్ పూడూర్ మండలం సోమన్‌గుర్తి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడిని పట్టణ కేంద్రంలోని నంబర్ 2 పాఠశాలలో ఆరో తరగతిలో, కూతురిని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

తాండూరు రూరల్: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల మాజీ వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి పేర్కొన్నారు. కొటబాసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు నాగార్జున, మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు..

కుల్కచర్ల: ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరుతున్నారని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరేశం అన్నారు. బుధవారం పలువురు చిన్నారులు బండవెల్కిచర్ల ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో బడిబాట విజయవంతం అవుతుందన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



కుల్కచర్ల: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



తాండూరు రూరల్: మాట్లాడుతున్న తారాసింగ్



పూడూరు: ఎన్కేపల్లిలో రెవెన్యూ సదస్సు

కుల్కచర్ల: భూ భారతి రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు కలుగుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, గిర్దవరులు రవి, ఖాజ, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, సంతోశ్, రెవెన్యూ అధికారులు లక్ష్మయ్య, స్వప్న, అనిత, కమల, తదితరులు పాల్గొన్నారు.

భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం..

పూడూరు: భూ భారతి ద్వారా రైతుల సమస్య పరిష్కారమవుతాయని తహసీల్దార్ భరత్‌గౌడ్ పేర్కొన్నారు. కడ్మూరు, ఎన్కేపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారి, ఆర్ఐ కావ్య, రెవెన్యూ సిబ్బంది శ్రీనాథ్, లవకుమార్, సంగీత, ఆనంద్, రామక్రిష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

తాండూరు రూరల్: భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని దీన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.